సాక్షి సిద్దిపేట

మంగళవారం । 28 । నవంబర్ । 2023



నిధులపై శ్వేతపత్రం ఇస్తారా?

చింతమడ్కలాగా దుబ్బాకలో ఇంటికి రూ. 10 లక్షలు కేసీఆర్ ఎందుకివ్వలేదో ప్రజలకు చెప్పాలని బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు ప్రశ్నించారు.

వివరాలు 6లో ▸



రాష్ట్రంలో అవినీతి పాలన

రాష్ట్రంలో అవినీతి పాలన సాగుతోందని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు.

వివరాలు 6లో ▸



మీరే మా బలం.. బలగం

మా బలం, బలగం సిద్దిపేట ప్రజలేనని మంత్రి హరీశ్‌రావు సతీమణి శ్రీనిత అన్నారు.

వివరాలు 7లో ▸

న్యూస్‌రీల్

4 గంటల నుంచి సైలెన్స్..



కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్

సిద్దిపేటరూరల్: ఈనెల 28వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి సైలెన్స్ పీరియడ్ పాటించాలని సీఈఓ(చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్) వికాస్‌రాజ్ సూచించారు. ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ నుంచి ముఖ్య అధికారులతో కలిసి ఆయన ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ, ఓటరు గుర్తింపు కార్డులు, స్లిప్పుల పంపిణీ, రిసెప్షన్ కేంద్రాలు, కౌంటింగ్ ఏర్పాట్లపై అధికారులను సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రి తరలింపు వంటివి సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి రమేశ్‌బాబు, ఎలక్షన్ సూపరింటెండెంట్ రామేశ్వర్, ఎలక్షన్ డీటీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీలో ప్రభుత్వం నిర్లక్ష్యం



నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు

హుస్నాబాద్: దశాబ్దంగా నియామకాలు మరిచిందని, మేనిఫెస్టోలో ఇచ్చిన నిరుద్యోగ భృతి, నియామకాలు గురించి పట్టించుకోని బీఆర్ఎస్‌ను ఓడించాలని నిరుద్యోగ, విద్యార్థి జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ చౌరస్తాలో వారు మాట్లాడారు. 10 ఏళ్లలో ప్రభుత్వం ఏ ఒక్కరికీ ఉద్యోగ అవకాశం కల్పించలేదన్నారు. ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సిద్ధమైతే ప్రతి పరీక్షా పత్రాలను లీక్ చేసిందని దుయ్యబట్టారు. ఉద్యోగాలు రాక చాలా మంది నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. కార్యక్రమంలో తెలంగాణ జేఏసీ నాయకులు కవ్వ లక్ష్మారెడ్డి, ప్రొఫెసర్ వీరన్న నాయక్, నాయకులు వీరన్న యాదవ్, ప్రశాంత్, విద్యాసాగర్, ప్రసాద్, శ్రీకాంతాచారి, జీవన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఓటే ప్రధాన ఆయుధం


తపాస్ జిల్లా అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న రఘువర్ధన్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఓటు ప్రజాస్వామ్యానికి పునాది అని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపాస్) జిల్లా అధ్యక్షుడు ఊడెం రఘువర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన జన జాగరణ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక సంవత్సరాలుగా ఓటర్లను చైతన్య పరుస్తూ తపస్ జనజాగరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తూనే ఉందన్నారు. ఓటు విలువ తెలిపేలా వృథా చేయకుండా ఉండేలా తెలియజేస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. వచ్చే ఐదేళ్లలో మన భవితవ్యాన్ని నిర్దేశించడానికి ఓటే ప్రధాన ఆయుధం అన్నారు. ఓటు హక్కు ద్వారా సరైన అభ్యర్థులను ఎన్నుకోవాలని సూచించారు.

ప్రతి ఏడాదీ జాబ్ క్యాలెండర్



- అభివృద్ధి, సంక్షేమమే మా బలం, బలగం
- ఉమ్మడి జిల్లాలో పదికి పది బీఆర్ఎస్ గెలుస్తుంది
- హస్తం, బీజేపీలకు ఓట్లేస్తే బోర్ బావులకు మీటర్లు ఖాయం
- సాక్షితో మంత్రి తన్నీరు హరీశ్‌రావు

ఓటరన్న రిస్క్ తీసుకోవద్దని ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బంపర్ మెజార్టీలు సాధించిన ఆయన మరోసారి సిద్దిపేట నుంచి బరిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఆయనను 'సాక్షి' పలకరించింది. రాబోయే రోజుల్లో ప్రతి ఏడాదీ జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి వెనువెంటనే ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేయడం అంటే మూడు గంటల కరెంట్‌ను ఒప్పుకోవడమేనని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇంకా అనేక విషయాలను వెల్లడించారు.

సాక్షి, సిద్దిపేట: ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అండ, ప్రజల ఆశీర్వాదంతో మరోసారి బీఆర్ఎస్సే గెలుస్తుందని మంత్రి హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో పదికి పది స్థానాలు గెలుస్తాం. తద్వారా ఈ జిల్లా పార్టీ కంచుకోటగా మరోసారి నిరూపితమవుతుంది. కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారు. నాడు కాంగ్రెస్ పాలనలో పరిస్థితి. నేడు బీఆర్ఎస్ పాలనలో పరిస్థితిని గుండె మీద చేయి వేసుకుని పరిశీలించి ఓటు వేయమని విజ్ఞప్తి చేస్తున్నా. నాడు కరువు కాటకాలతో వలసల జిల్లాగా ఉన్న ఈ ప్రాంతం నేడు రెండు పంటలు పండే పచ్చని మాగాణిగా మారింది. నారాయణఖేడ్, జోగిపేట, జహీరాబాద్ ప్రాంతాల్లో వలసలు వాపస్ వచ్చాయి. కర్ణాటక సరిహద్దుల్లో ఉండటం తమ ప్రజలకు స్పష్టత వచ్చింది. ఆ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెనం పై నుంచి పొయ్యిలో పడినట్లు అయిందని అక్కడి వారు చర్చించుకుంటున్నారు.

❖ మార్పు అంటే 3 గంటల కరెంటా?

కాంగ్రెస్ వాళ్లు మార్పు అంటున్నారు. 24 గంటల కరెంట్ నుంచి 3 గంటలకు తగ్గించడమే మార్పా? ప్రజల జీవన విధానం, ఆర్థిక స్థితిగతుల్లో మార్పు రావాలి. కాంగ్రెస్ దేశంలో ఎక్కడా రూ. 1000 మించి పెన్షన్ ఇవ్వడం లేదు. నేడు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనూ ఇవ్వడం లేదు. తెలంగాణలో ఇస్తామనడం ఇక్కడి ప్రజలను మభ్యపెట్టడమే తప్ప మరొకటి కాదు. కేసీఆర్ ఎకరానికి రూ.16వేలు పెట్టుబడి ఇస్తామని చెబుతుంటే కాంగ్రెస్ రూ.15 వేలని అంటుంది. రైతుబంధు సాయంలో కోత పెట్టాలని ఆపార్టీ చూస్తోంది. కర్ణాటకలో బంద్ చేసి రాంరాం అన్నది. దీనిని ప్రజలు గమనించాలి. నాడు తాగు నీటికి నోచుకోని జిల్లాకు ఇవాళ బీఆర్ఎస్ సాగు నీటిని తెచ్చింది. ఇప్పటికే ఐదు నియోజకవర్గాలకు గోదావరి నీళ్లు అందుతున్నాయి. త్వరలో బసవేశ్వర, సంగమేశ్వర ద్వారా రెండేళ్లలో మిగతా నియోజవర్గాలకు సాగు నీటిని అందిస్తాం.

❖ నాన్ లోకల్స్

కాంగ్రెస్ అధికారంలో వస్తే పైరవీకారులు, బ్రోకర్ల రాజ్యం వస్తుంది. రాహుల్, ప్రియాంక ఎన్నికల ముందే కనబడతారు. ఎన్నికల తర్వాత ఢిల్లీలో ఉంటారు. నేడు కర్ణాటకలో రాహుల్ జాడలేదు. ప్రియాంక పత్తాలేకుండా పోయింది.

❖ కేసీఆర్ అంటే నమ్మకం

కేసీఆర్ అంటే నమ్మకం. కాంగ్రెస్ అంటే మోసం. బీఆర్ఎస్ మేనిఫెస్టోలో రూ.400కే సిలిండర్, సౌభాగ్యలక్ష్మి ద్వారా మహిళలకు నెలకు రూ.3వేలు, ఆసరా రూ.5వేలు, పేదలకు సన్న బియ్యం అందిస్తాం. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.15లక్షలకు పెంచుతాం. అసైన్డ్ భూములు పట్టా భూములుగా మార్చడం, గురుకులాలను డిగ్రీ కళాశాలకు అప్‌గ్రేడ్ చేస్తాం.

❖ వారికి ఓట్లేస్తే.. మీటర్లు ఖాయం

కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేస్తే బోర్ బావులకు మీటర్లు పెడతారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో బోర్ బావుల దగ్గర ఇప్పటికే మీటర్లు బిగించారు. కర్ణాటకలో మీటర్లు పెడతామని అంగీకరించారు. వాటి దగ్గర మీటర్లు పెట్టాలనే విధానం తెచ్చింది బీజేపీ. అమలు చేస్తోంది కాంగ్రెస్. ఈ రెండు రైతులకు అన్యాయం చేయబోతున్నాయి. 24 గంటల కరెంట్ కావాలంటే కారు గుర్తుకు ఓటు వేయండి.

❖ రూ. 2 వేల ఆసరా పింఛన్ ఇచ్చాం

బీడీ కార్మికులకు కాంగ్రెస్ పుర్రె గుర్తునిచ్చింది. జీఎస్టీని బీజేపీ పెట్టింది. రెండు పార్టీలు బీడీ కార్మికుల నోట్లో మట్టి కొట్టాయి. ఈ కార్మికులకు రూ. 2 వేల ఆసరా పింఛన్ ఇచ్చి కడుపులో పెట్టుకున్న నాయకుడు కేసీఆర్. వారిని తోబుట్టువులా భావించి ఆత్మగౌరవాన్ని నిలబెట్టింది కేసీఆర్. తమ ప్రభుత్వం లక్షన్నర ఉద్యోగాలు ప్రభుత్వ రంగంలో భర్తీ చేసింది. వీటికి అదనంగా ప్రైవేట్ రంగంలో 24 లక్షలు, ఐటీలో 6లక్షల ఉద్యోగాలు కల్పించాం. రాబోయే రోజుల్లో ప్రతి ఏడాదీ జాబ్ క్యాలెండర్ ముందుగా ప్రకటిస్తాం. దాని ప్రకారమే ఉద్యోగాలు భర్తీ చేస్తాం అని హరీశ్‌రావు తెలిపారు.

మీ ఆశీస్సులే నాకు బలం బలగం..

సిద్దిపేట ప్రజలంటే ఓటర్లు అని నేను ఏనాడూ అనుకోలేదు. సిద్దిపేట అనేది నా కుటుంబంగానే భావిస్తున్నా. మీరు కూడా నన్ను ఓ కుటుంబ సభ్యుడిగానే అక్కున చేర్చుకుంటున్నారు. నాడు తెలంగాణ ఉద్యమ సమయంలో, నేడు సిద్దిపేట ప్రగతిబాటలో నాకు తోడుగా నీడగా ఉంటూ కొండంత అండగా నిలుస్తున్నారు. 60 ఏళ్లుగా మూడు నినాదాలు.. ఎన్నికల హామీలుండేవి. ఇప్పుడు ట్యాగ్‌లైన్‌లు నిజాలయ్యాయి. జిల్లా ఏర్పాటు, గోదావరి నీళ్లు, రైలును తెచ్చుకున్నాం. మీరందించిన ప్రోత్సాహంతో సిద్దిపేటను ఎంతో అభివృద్ధి చేశా. అహర్నిశలు శ్రమించి అభివృద్ధి పరీక్ష రాశా. నాకు ఎన్ని మార్కులు వేస్తారో మనస్సాక్షికి తెలుసు. మీ అందిస్తున్న శక్తితో మరింత కష్టపడతా. మీ ఆశీస్సులే నాకు బలం... బలగం.

ప్రచార హోరు

- నేడు సీఎం ఆశీర్వాద సభ
- సిద్దిపేటలో మంత్రి హరీశ్ రావు, దుబ్బాకలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి రోడ్ షో
- నేటితో ముగియనున్న ప్రచార పర్వం



సాక్షి, సిద్దిపేట: శాసన సభ ఎన్నికల ప్రచారం నేటి (మంగళవారం) సాయంత్రం 5 గంటలతో ముగిస్తోంది. అక్టోబర్ 9న ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ విడుదల కాగా నవంబర్ 3న ఎన్నికలకు నోటిఫికేషన్‌ను అధికారులు విడుదల చేశారు. ఈ నెల 10వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించారు. 4 నియోజకవర్గాలైన హుస్నాబాద్, దుబ్బాక, సిద్దిపేట, గజ్వేల్‌లో మొత్తం 95 మంది బరిలో ఉన్నారు.

నేడు ఆశీర్వాద సభ, రోడ్‌షోలు..

గజ్వేల్‌లో నేడు సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించనున్నారు. అయితే హుస్నాబాద్‌లో ప్రారంభమైన ప్రజా ఆశీర్వాద సభ గజ్వేల్‌లో జరిగే సభతో ముగియనుంది. కాగా సిద్దిపేటలో ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు రోడ్ షో నిర్వహించనున్నారు. దుబ్బాకలో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు తరఫున పట్టణంలో నిర్వహించే రోడ్ షోకు కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి హాజరు కానున్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి

- దుబ్బాకను ఆదర్శంగా తీర్చిదిద్దుతా..
- 6 గ్యారంటీలను తప్పక అమలు చేస్తా
- 'సాక్షి'తో కాంగ్రెస్ దుబ్బాక అభ్యర్థి చెరుకు శ్రీనివాస్ రెడ్డి



దుబ్బాక: 'మాజీ మంత్రి దివంగత చెరుకు ముత్యం రెడ్డి అంటేనే నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం. ఉమ్మడి రాష్ట్రంలో దుబ్బాక నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రిగా సేవలందించారు. ఆయన అంటేనే దుబ్బాక ఆత్మగౌరవం' అని దుబ్బాక కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తనను గెలిపిస్తే దుబ్బాకను రెవెన్యూ డివిజన్‌తోపాటు విద్యార్థుల కోసం పీజీ కాలేజీ తెస్తామన్నారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలతోపాటు 6 గ్యారంటీలను తప్పక అమలు చేస్తామన్నారు. సోమవారం ఆయన 'సాక్షి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు.

మా తండ్రి ముత్యం రెడ్డి అంటేనే నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం. ఆయన వారసుడిగా ప్రజలు నాకు ఒక్క అవకాశం ఇస్తే 5 సంవత్సరాలు దుబ్బాక ప్రజలకు సేవకుడిలా పని చేస్తా. ముత్యం రెడ్డి ఆశయ సాధన కోసం, దుబ్బాక ఆత్మ గౌరవం కోసం రాజీలేని పోరాటం చేస్తా. మా నాన్న నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. నేను మాత్రం అమెరికా ఉద్యోగం చేసుకునే వాడిని. అమ్మ విజయలక్ష్మి మా ఊరు తుక్కాపూర్‌లో వ్యవసాయం చేసుకుంటూ సామాన్య రైతు జీవితం గడిపేది.

ముత్యం రెడ్డి హయాంలోనే అభివృద్ధి

దుబ్బాక నియోజకవర్గంలో కళాశాలలు, వ్యవసాయ మార్కెట్లు, దుబ్బాకకు బస్‌డిపో, రోడ్లు, కూడవెల్లి చెక్‌డ్యాం వంటి అభివృద్ధి పనులు కేవలం ముత్యం రెడ్డి హయాంలోనే జరిగాయి.

సైనికుడిలా పని చేస్తా

బీఆర్ఎస్, బీజేపీ పాలనలో దుబ్బాకకు జరిగిన అభివృద్ధి అంటూ ఏమీలేదు. బీఆర్ఎస్, బీజేపీ నాయకుల ఝూటా మాటలు నమ్మి మోసపోకండి. నాకు ఒక్క అవకాశం ఇవ్వండి దుబ్బాకను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా. ఈ ప్రాంతాభివృద్ధి కోసం సైనికుడిలా పని చేస్తా. నీతివంతమైనా పాలన చేసి దుబ్బాకలో ఇందిరమ్మ రాజ్యం తీసుకొస్తా. రాష్ట్రంలో అధికారంలోకి రాబోయేది కాంగ్రెస్సే. చేయి గుర్తుకు ఓటు వేసి నన్ను ఆశీర్వదించండి అని చెరుకు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

సీఎం సెంటిమెంట్!

నేడు గజ్వేల్‌లో కేసీఆర్ 'ప్రజా ఆశీర్వాద సభ'

- గడిచిన రెండు ఎన్నికల్లోనూ ఇదే ఆనవాయితీ
- ఏర్పాట్లను పరిశీలించిన బీఆర్ఎస్ నేతలు

గజ్వేల్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారపర్వం తుది అంకానికి చేరింది. ముఖ్యమంత్రి కేసీఆర్ సొంత నియోజకవర్గం గజ్వేల్‌లో ప్రజా ఆశీర్వాద సభ(సెంటిమెంట్ సభ) నిర్వహించడానికి బీఆర్ఎస్ ఏర్పాట్లు పూర్తి చేసింది. పట్టణంలోని ఐఓసీ (ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్) వెనుకభాగంలో ఉన్న మైదానంలో లక్ష మంది జనసమీకరణే లక్ష్యంగా ఆ పార్టీ ముందుకు సాగుతోంది. 2014, 2018 ఎన్నికల సందర్భంలో గజ్వేల్‌లో చివరి సభను నిర్వహించడం ద్వారా భారీ విజయాన్ని అందుకున్న అధికార పార్టీ, తాజాగా ఇదే ఆనవాయితీని కొనసాగించడానికి సిద్ధమైంది. మంగళవారం ఉదయం వరంగల్ ఈస్ట్, వెస్ట్ నియోజకవర్గాల్లో ప్రచారం పూర్తి చేసుకొని కేసీఆర్ మధ్యాహ్నం ఇక్కడికి హెలికాప్టర్ ద్వారా చేరుకుంటారు. చిట్టచివరి సభ కావడం వల్ల తన సొంత ఇలాకాలోనే కేసీఆర్ తెలంగాణ వ్యాప్తంగా బీఆర్ఎస్ ఎన్నికల ప్రచార పర్వానికి దిశానిర్దేశం చేసేలా కీలకమైన వ్యాఖ్యలు చేసే అవకాశమున్నందు వల్ల బహిరంగ సభకు అధిక ప్రాధాన్యత చేకూరింది. కాగా సోమవారం సభ ఏర్పాట్లను రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ (టీఎస్ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణంలో కలియ తిరిగారు. వేదిక, వీఐపీ, ప్రెస్ గ్యాలరీ, హెలిపాడ్ ప్రదేశాలను పరిశీలించారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేయాల్సిన ఇతర ముఖ్యమైన అంశాలపైనా చర్చించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఇక్కడ నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభ చిట్టచివరిది కావడం వల్ల అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని గజ్వేల్, ములుగు, వర్గల్, జగదేవ్‌పూర్, మర్కూక్, కొండపాక, కుకునూర్‌పల్లి, తూప్రాన్, మనోహరాబాద్ మండలాల నుంచి లక్ష మంది జనసమీకరణే లక్ష్యంగా ఏర్పాట్లు చేశామన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని కొత్త పుంతలు తొక్కించిన బీఆర్ఎస్ ప్రస్తుత ఎన్నికల్లో అఖండ మెజారిటీ ఖాయమని పేర్కొన్నారు. గజ్వేల్‌లోనూ కేసీఆర్ లక్ష ఓట్ల మెజారిటీని కానుకగా అందించబోతున్నామని స్పష్టం చేశారు. ఏర్పాట్ల పరిశీలనలో మాజీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ భూంరెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.



సభా ప్రాంగణం వద్ద మాట్లాడుతున్న నేతలు

భద్రతా ఏర్పాట్లపై సిద్దిపేట సీపీ శ్వేత సమీక్ష

సీఎం బహిరంగ సభ నేపథ్యంలో సిద్దిపేట శ్వేత భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. పట్టణంలోని కోలా అభిరామ్ గార్డెన్స్‌లో అదనపు డీసీపీ శ్రీనివాసరావు, ఏసీపీలు రమేశ్, సతీశ్, సురేందర్‌రెడ్డి, రవీందర్‌రాజు, ప్రసన్నకుమార్, శ్రీనివాస్‌లతో పాటు, సీఐలు జాన్‌రెడ్డి, జానకీరామ్‌రెడ్డి, రంగ క్రిష్ణ, రఘుపతిరెడ్డి, పోలీసు సిబ్బందికి సూచనలు చేశారు. సీఎం పర్యటన నేపథ్యంలో ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా నియోజకవర్గంలోని మండలాల వారీగా పార్కింగ్ స్థలాలను కేటాయించారు.

72 గంటలు అలర్ట్

- ప్రలోభాలకు తావివ్వకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి
- జిల్లా ఎన్నికల అధికారి జీవన్‌పాటిల్

సిద్దిపేటరూరల్: ఎన్నికల్లో మనీ, లిక్కర్, మజిల్ ప్రభావం వంటి ప్రలోభాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఓటరు ఓటు వేసేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్ ఎన్నికల నిఘా బృందాలతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. పోలింగ్ చివరి 72 గంటలలో తీసుకోవాల్సిన చర్యలపై పలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాలుగు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయినందున మీడియా ఫోకస్ అంతా తెలంగాణపై ఉందన్నారు. ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించి ఆదర్శంగా నిలిచేలా పని చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న ఎస్ఎస్‌టీ బృందం లొకేషన్లను అధిక ప్రభావం గల ప్రాంతాలకు మార్చి ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలను పెంచి జిల్లాలోని ఫంక్షన్ హాల్స్, లాడ్జీలు, కమ్యూనిటీ హాల్స్‌లో తనిఖీలు నిర్వహించాలన్నారు. పోలింగ్ సందర్భంగా పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంల రవాణా, పోలింగ్ అనంతరం స్ట్రాంగ్ రూములకు తరలింపుపై పోలీస్ శాఖ అత్యంత జాగ్రత్తతో చర్యలు తీసుకోవాలని సూచించారు.

బీఆర్ఎస్‌కే మా మద్దతు



మాట్లాడుతున్న రామచంద్రం

గజ్వేల్‌రూరల్: మాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్న బీఆర్ఎస్‌కే మద్దతు తెలుపుతున్నామని ఆసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు రామచంద్రం పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్‌లో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిని కలిసిన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నది ఒక్క కేసీఆరేనని కొనియాడారు. కార్యక్రమంలో మాల సంఘాల రాష్ట్ర జేఏసీ చీఫ్ కోఆర్డినేటర్ రావుల అంజయ్య, కన్వీనర్ కనకరాజు, ఉపాధ్యక్షుడు తుమ్మ శ్రీనివాస్, కో-చైర్మన్ భీమసేన పాల్గొన్నారు.

వాకింగ్‌కు వెళ్తున్నామని..

- ఈతకెళ్లి ఇద్దరు బాలురు మృతి



వినయ్



సంపత్

మర్కూక్ (గజ్వేల్): ఈత సరదా రెండు నిండు ప్రాణాలను బలి తీసుకుంది. పండగపూట తల్లిదండ్రులతో గడపాల్సిన వీరు నీట మునిగి తల్లిదండ్రులకు పుత్ర శోకాన్ని మిగిల్చారు. అమ్మానాన్న.. వాకింగ్‌కు మా స్నేహితులతో కలిసి వెళ్తున్నామని వెళ్లి విగతజీవులై కనిపించారు. ఈ విషాదకర సంఘటన మర్కూక్ మండలకేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ శంకర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సంపత్(13), మైసిగారి వినయ్ (11) కార్తీక పౌర్ణమి సెలవులు కావడంతో మరో ఇద్దరు స్నేహితులతో కలిసి సోమవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లారు. ఇంటికి తిరిగొస్తుండగా మార్గమధ్యలో కొండపోచమ్మ కాలువ వద్ద ఈత కొట్టడానికి వారితోపాటు మరో స్నేహితుడు కలిసి కాల్వలోకి దిగారు. ప్రమాదవశాత్తు నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వారిద్దరూ నీట మునిగారు. అతను ప్రమాదం నుంచి బయటపడి ఇంకో మిత్రుడితో కలిసి జరిగిన విషయాన్ని బాధిత కుటుంబాలకు చెప్పారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న వారు జాలర్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టి సంపత్ మృతదేహాన్ని బయటకు తీశారు. వినయ్ మృతదేహం చాలా సేపు దొరక్కపోవడంతో గజ ఈతగాళ్లను రప్పించి బయటకు తీయించారు. అనంతరం వైద్యులు ఇక్కడే పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు మృతదేహాలను అప్పజెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

● నాచగిరి.. వ్రతసిరి





నాచగిరిలో కార్తీక వైభవం వెల్లివిరిసింది. సోమవారం కార్తీక పౌర్ణమి పర్వదిన వేళ శివకేశవుల నిలయమైన నాచారం గుట్ట శ్రీలక్ష్మీ నృసింహ క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ఏసీ అన్నపూర్ణ, సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు. క్షేత్రంలో అభిషేకాలు, అర్చనలు, కార్తీక సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలతో భక్తి భావనలు ఉప్పొంగాయి. 231 మంది దంపతులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు. శివకేశవులను దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. అలాగే ఆలయ పుష్కరిణిలో, హరిద్రానదిలో కార్తీక స్నానాలాచరించారు. నృసింహుని సన్నిధిలో దీపారాధన చేశారు. కాగా కార్తీక దీపోత్సవం నేత్రపర్వంగా సాగింది.

\- వర్గల్ (గజ్వేల్)

● కార్తీకం.. కమనీయం





కార్తీక పౌర్ణమిని ప్రజలు ఆనందోత్సవాల నడుమ నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచే ఆలయాల వద్ద భక్తుల సందడి నెలకొంది. పట్టణంలోని ఉమాపార్థీవ కోటిలింగేశ్వర, వెంకటేశ్వర, శివాలయం, సంతోషిమాత, గణపతి ఆలయాలతో పాటుగా అన్ని దేవాలయాల్లోనూ భక్తులు దీపారాధన చేశారు. అలాగే లక్ష్మీదేవి, కేదారేశ్వర, సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. ప్రతి ఇంటి ఎదుట మహిళలు దీపాలు వెలిగించి శ్రీలక్ష్మీ అమ్మవారికి స్వాగతం పలికేలా పూలతో సుందరంగా అలంకరించారు. వెంకటేశ్వర ఆలయంలో స్వామివారి పల్లకీ సేవలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు.

\- ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)

క్లుప్తంగా

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ



మజీద్‌పల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారి

వర్గల్(గజ్వేల్): శాంతియుత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ సోనమ్ టెన్సింగ్ భూటియా సూచించారు. సోమవారం ఆయన తొగుట సీఐ కమలాకర్, బేగంపేట ఎస్సై అరుణ్‌తో కలిసి మజీద్‌పల్లి, నెంటూరు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. చెక్‌పోస్ట్‌లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఎన్నికల విధుల్లో అలసత్వం తగదన్నారు. ఎక్కడైనా ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నట్లు తెలిస్తే 8712667309 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఓటు హక్కు వజ్రాయుధం



హుస్నాబాద్‌లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

హుస్నాబాద్: ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సోమవారం పట్టణంలో ఎస్సై మహేష్ జార్ఖండ్ ఆర్మ్‌డ్ పోలీసులు, స్థానిక పోలీసులతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మహేష్ మాట్లాడుతూ ఓటు వజ్రాయుధం లాంటిదని, అసెంబ్లీ ఎన్నికల్లో తప్పక ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఉత్తమ నాయకుడికి ఓటు వేయాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

జిల్లాలో 144 సెక్షన్ అమలు

సిద్దిపేటకమాన్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని సిద్దిపేట సీపీ శ్వేత తెలిపారు. ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి డిసెంబర్ 1వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఈ నిబంధనలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. 30న ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద గుంపులుగా తిరగవద్దని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తన నియమాలను తప్పకుండా పాటించాలని తెలిపారు.

ప్రలోభాలకు గురిచేయొద్దు



రికార్డులను పరిశీలిస్తున్న వివేక్ కుమార్ సిన్హా

దుబ్బాక: మద్యం, నగదు, డబ్బులతో ఓటర్లను ప్రలోభాలకు గురి చేయవద్దని కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకులు వివేక్ కుమార్ సిన్హా సూచించారు. సోమవారం దుబ్బాక ఐఓసీ కార్యాలయంలో అభ్యర్థుల ఖర్చుల రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్, దుబ్బాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి గరీమా అగర్వాల్, ఏఆర్ఓ వెంకట్ రెడ్డి తదితరులున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్సు అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేకోవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9311685170. [T-12 58784]

WANTED

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్/ ఫుల్ టైమ్ వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర: 9177736926 [G-624725]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నిధులపై శ్వేతపత్రం ఇస్తారా..?

- చింతమడ్కలా దుబ్బాకలో ఇంటికి రూ.10 లక్షలు ఎందుకివ్వలే..
- బీజేపీ అభ్యర్థి, ఎమ్మెల్యే రఘునందన్‌రావు



దుబ్బాకలో మాట్లాడుతున్న మాధవనేని రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: 'నేను పుట్టి పెరిగి విద్యాబుద్ధులు నేర్చిన గడ్డ దుబ్బాక అంటే చాలా ప్రేమ' అని చెప్పిన కేసీఆర్.. చింతమడ్క లాగా దుబ్బాకలో ఇంటికి రూ.10 లక్షలు ఎందుకివ్వలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. సోమవారం దుబ్బాకలో ఆయన మాట్లాడారు. దుబ్బాక సభలో కేసీఆర్ ఈ ప్రాంతంపై కపట ప్రేమ ఒలకబోశారని..అంత ప్రేమ ఉన్నోడైతే సీఎం చదువుకున్న పాఠశాల భవనం, వేంకటేశ్వర ఆలయం ప్రారంభోత్సవాలకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. కేసీఆర్ అంటేనే అబద్ధాలని.. ఆయన చెప్పిన అబద్ధాల గురించి చెప్పాలంటే ఐదేళ్లు పడుతుందని విమర్శించారు.

తండ్రీకొడుకు, అల్లుడికి నా మీద అంత కోపమెందుకో?

దుబ్బాకకు వరుసపెట్టి తండ్రీకొడుకు, అల్లుడు వచ్చి తనను ఇష్టం వచ్చినట్లు తిడుతుండ్రు అని రఘునందన్‌రావు ఆరోపించారు. అసలు మీరు ఏం చేశారని దుబ్బాకకు వస్తున్నరో ప్రజలకు వివరించాలని అన్నారు. మీరు చేసిన అరాచకాలకు జనానికి విరక్తి వచ్చే దుబ్బాకలో రఘునందన్‌రావు ఎమ్మెల్యే అయ్యాడన్న విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. దుబ్బాక సభలో ఉద్యమకారుడు, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన స్వర్గీయ రామలింగారెడ్డి పేరు తీయడానికి కేసీఆర్‌కు ఎందుకు మనసు రావడం లేదని ప్రశ్నించారు.

దుబ్బాకకు ఎన్ని నిధులు ఇచ్చారు?

గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలకు నిధులెన్ని ఇచ్చారో.. దుబ్బాకకు ఏం చేశారో శ్వేత పత్రం ఇవ్వాలని కోరారు. 2016లో రామలింగారెడ్డి అడిగినప్పుడు దుబ్బాకకు రెవెన్యూ డివిజన్ ఎందుకివ్వలేదన్నారు. ఇప్పుడు ప్రభాకర్‌రెడ్డి గెలిస్తేనే ఇస్తారా.. ఇది ఎంత వరకు సమంజసమో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ఇప్పుడు గెలిపిస్తే అభివృద్ధి చేస్తాం అనడం చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని చెప్పారు.

ఈగ వాలినా ఊరుకోను

దుబ్బాక మీద పరాయి పెత్తనం ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదన్నారు. దుబ్బాక ప్రజల మీద ఈగ వాలిన ఊరుకోనన్నారు. దుబ్బాకలో దళితులకు దళిత బంధు, బీసీలకు బీసీ బంధు, పేదలకు డబుల్ బెడ్రూంలు ఎందెకివ్వలేదో చెప్పాలన్నారు. దుబ్బాక ప్రజల ఆత్మగౌరవం మీద దెబ్బకొడితే నేను ఊరుకోనన్నారు. ప్రజల గుండెల్లో నిలిచిన రఘునందన్‌రావును తిడితే వారికి తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బాలేష్‌గౌడ్, ఎస్ఎన్ చారి, విభూషణ్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి తదితరులున్నారు.



బీజేపీలో చేరుతున్న సీనియర్ నాయకులు శేఖర్

అందరికోసం పనిచేస్తా

చేగుంట(తూప్రాన్): అభిమానంతో గెలిపిస్తే అందరికోసం పనిచేస్తానని దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. సోమవారం పెద్దశివనూర్ గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అప్పాల శేఖర్‌తోపాటు 100 మంది కార్యకర్తలు బీజేపీలో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్దశివనూర్ గ్రామస్తులకు ఏ కష్టం వచ్చినా ముందుంటానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భూమలింగంగౌడ్, వెంగళరావు, అంజాగౌడ్, నగేష్, శోభన్, నర్సింలు పాల్గొన్నారు.

హరీశ్.. దుబ్బాకకు ప్రథమ శత్రువు



మిరుదొడ్డిలో మాట్లాడుతున్న రఘునందన్ రావు

మిరుదొడ్డి(దుబ్బాక): అభివృద్ధిని అడ్డుకుంటున్న మంత్రి హరీశ్‌రావే దుబ్బాకకు ప్రథమ శత్రువని రఘునందన్‌రావు ఆరోపించారు. మండల కేంద్రమైన మిరుదొడ్డిలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దుబ్బాక ఎమ్మెల్యేకు ఎక్కడ పేరొస్తదోనని హరీశ్ నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకున్నాడన్నారు. దుబ్బాక అభివృద్ధిని కోసం హరీశ్, కేటీఆర్ చుట్టూ తిరిగి వినతులు సమర్పించినా బుట్టదాఖలు చేశారని మండిపడ్డారు. అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తానంటున్న సీఎం కేసీఆర్ మాటలు నమ్మొద్దన్నారు. మిరుదొడ్డి మండలంలో అసైన్డ్ భూములను డ్రోన్ కెమెరాలతో ఎందుకు సర్వే చేయించారని ప్రశ్నించారు. డబ్బుల మూటలతో వచ్చిన వారికే బీఆర్ఎస్‌లో చోటు ఉందన్నారు. దుబ్బాక నియోజక వర్గంలో దళితబంధు, బీసీ బంధు ఇవ్వలేదని మండిపడ్డారు. బీజేపీ గెలిస్తే పింఛన్‌లు రావని బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాన్ని మానుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన బలం బలగం దుబ్బాక ప్రజలేనన్నారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, వైన్స్ మాత్రం వెలుస్తున్నాయన్నారు. ప్రభుత్వం స్కీంలు, ఊర్ల పేర్లు, మనుషులను గుర్తించలేని బీఆర్ఎస్ అభ్యర్థి ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి మాత్రం తాగి తందనాలు ఆడడానికి మాత్రం పబ్బులు కావాలని అడుగుతున్నాడని అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మొగుళ్ళ మల్లేశం, మద్దెల రోశయ్య, మల్లన్న గారి భిక్షపతి, ఎల్ముల దేవరాజు పాల్గొన్నారు.

ఆదరిస్తే.. అభివృద్ధి షికారే..

దుబ్బాక: పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు వినూత్నంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డికి మద్దతుగా సోమవారం 17వ వార్డులో కౌన్సిలర్ పులిగారి కల్పన బజ్జీలు వేసి ఓటర్లను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు ఆసిఫ్, రాజమౌళి, భూంరెడ్డి, అశోక్, ప్రశాంత్, వీణ తదితరులున్నారు.



తాతా.. కారును యాదుంచుకో

చేర్యాల(సిద్దిపేట): జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా మండల పరిధిలోని ఆకునూరులో బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోతి విజయ్ ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఓ ఇంటి వద్ద కూర్చున్న పెద్దాయనకు కారు గుర్తును చూపి ఓటేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో దాసు, కనకయ్య తదితరులున్నారు.



బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు



బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): ప్రజల స్పందన చూస్తుంటే బీఆర్ఎస్ గెలుపు ఖాయమైందని, ఎక్కడ ప్రచారానికి వెళ్లినా పార్టీలో భారీగా చేరుతున్నారని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం కూచారంకు చెందిన అంబేడ్కర్ సంఘం సభ్యులు 100 మంది, ముప్పిరెడ్డిపల్లికి చెందిన కాంగ్రెస్ మండల ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు సతీశ్‌చారిలు గులాబీ పార్టీలో చేరారు. కార్యక్రమంలో పురం మహేశ్, విఠల్‌రెడ్డి, వెంకట్‌గౌడ్, దాసరి నరేష్, పురం రవి, రమేష్‌గౌడ్, మాంగ్యా నాయక్, ఉదయ్‌రంజన్‌గౌడ్, వీరేష్‌గౌడ్ ఉన్నారు.

మత్స్యకారుల మద్దతు బీఆర్ఎస్ పార్టీకే..

గజ్వేల్‌రూరల్: మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి అండగా నిలుద్దామని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పాండవుల చెరువు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చెరువులు, కుంటలలో చేప పిల్లలను వదులుతూ మత్స్యకారులకు ఉపాధి కల్పిస్తున్నట్లు గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 6లక్షల మత్స్యకార సంఘం సభ్యత్వం కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని, గ్రామాల్లో ముదిరాజ్ భవనాల నిర్మాణం చేపట్టారన్నారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పూడికతీత పనులు చేపట్టి... కొండపోచమ్మ, మల్లన్నసాగర్, రంగనాయకసాగర్ ప్రాజెక్టుల ద్వారా గోదావరి జలాలను నింపారన్నారు. గత ప్రభుత్వాలు ముదిరాజ్‌లను ఓటు బ్యాంకుగా మాత్రమే పరిగణించగా... తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి కోసం కృషి చేశారన్నారు. ఐదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 500 కోట్ల వ్యయంతో చేప పిల్లలను పంపిణీ చేయగా... ప్రతియేటా రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. చేపలను మార్కెటింగ్ చేసేందుకు ఫోర్, టూ వీలర్ వాహనాలను అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు కొంటమైన నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పాలి

- ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్

గజ్వేల్: 'రైతు బంధు' డబ్బులు రాకుండా అడ్డుకున్న కాంగ్రెస్, బీజేపీలకు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్ పిలుపునిచ్చారు. సోమవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్‌కు రైతుల్లో వస్తున్న ఆదరణ చూసి జీర్ణించుకోలేక ఆ రెండు పార్టీలు కుట్రలకు పాల్పడుతున్నాయని మండిపడ్డారు. డిసెంబర్ 3 తర్వాత కేసీఆర్ మూడోసారి హ్యాట్రిక్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. దీని తర్వాత ప్రభుత్వ పథకాల అమలుకు ఎలాంటి ఇబ్బంది ఉండబోదన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు క్రిష్టాగౌడ్, ఎంపీటీసీ ఆంజనేయులు, కౌన్సిలర్ చందు పాల్గొన్నారు.



గజ్వేల్‌లో మాట్లాడుతున్న దేవీ రవీందర్



పూజలు చేస్తున్న ప్రతాప్‌రెడ్డి

రాముని బండలో కార్తీక పూజలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం జంగంరెడ్డిపల్లిలోని రామునిబండ శ్రీకోదండ సీతా రామచంద్రస్వామి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు ఆలయంలోని గుండంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. సర్పంచ్ దంపతులతో పాటు మరో పది జంటలు సత్యనారాయణ వ్రతాలు ఆచరించారు. మహిళలు దీపారాధన చేశారు. రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండపోచమ్మ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఆత్మ చైర్మన్ రంగారెడ్డి, నరేష్, కుమార్, పావని, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐటీ ఉద్యోగాల వెల్లువ

- 160 మందిని ఎంపిక చేసిన కంపెనీలు
- ఆఫర్ లెటర్లు అందుకున్న యువత



ఉద్యోగాలకు ఎంపికైనవారితో టీం అప్ ఐటీ కంపెనీ సీఈఓ చైతన్య

సిద్దిపేట అర్బన్: స్థానికంగా ఉంటూ ఐటీ ఉద్యోగం చేయాలనే గ్రామీణ, పట్టణ యువత కలలు నెరవేరుతున్నాయి. ఐటీహబ్ అందుబాటులోకి రావడంతో ఐటీ కంపెనీలు సిద్దిపేట వేదికగా తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. అందుకోసం స్థానిక యువతను వివిధ కంపెనీలు ఉద్యోగాల్లో చేర్చుకుంటున్నాయి. ఈ క్రమంలో సోమవారం సిద్దిపేట ఐటీ హబ్‌లో వివిధ కంపెనీలు 160 ఖాళీలకు సంబంధించి ఇంటర్వ్యూలు, గ్రూప్ డిస్కషన్, కౌన్సిలింగ్ నిర్వహించాయి. టీం అప్, ఫిక్సిటీ ఎడ్యూటెక్, కామర్స్ సీఎక్స్ ఐటీ కంపెనీలు కొత్త వారిని నియమించుకున్నాయి. మొబైల్ అప్లికేషన్స్‌కు రూపొందించేందుకు టీం అప్ కంపెనీ 30 మందిని, అలాగే మార్కెటింగ్, కంప్యూటర్స్ విభాగంలో పనిచేసేందుకు ఫిక్సిటీ కంపెనీ 80 మందిని, కామర్స్ సీఎక్స్ అనే కంపెనీ 50 మందిని ఎంపిక చేశాయి. టాస్క్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న వారిలో 30 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారు. ప్రస్తుతం ఐటీ హబ్‌లో 370 మంది ఉద్యోగాలు చేస్తుండగా కొత్తగా 160 మంది ఉద్యోగాలు పొందారు.

సంతోషంగా ఉంది

పుట్టిపెరిగిన ఊరిలోనే ఐటీ రంగంలో ఉద్యోగం రావడం సంతోషంగా ఉంది. ఐటీ హబ్ సిద్దిపేటలో ఏర్పాటు కావడంతో నాలాంటి వారికి ఉద్యోగాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందనే బాధ తప్పింది. కుటుంబ సభ్యులతో కలిసి ఉంటూ ఉద్యోగం చేయనుండటం గొప్ప అనుభూతినిస్తుంది. – శ్రీనాథ్, సిద్దిపేట



హాస్టల్‌లో ఉండే బాధ తప్పింది



సిద్దిపేటలోనే ఐటీ ఉద్యోగం రావడంతో దూర ప్రాంతంలో హాస్టల్‌లో ఉంటూ ఉద్యోగం చేసుకునే బాధ తప్పింది. హాస్టల్‌లో ఉంటూ ఉద్యోగం చేసుకునే వారికి భోజనం సరివడక చాలా ఇబ్బంది పడుతుంటారు. ఇప్పుడు భోజనం విషయంలో ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. – సుప్రియ, సిద్దిపేట

రాష్ట్రంలో అవినీతి పాలన

- బీజేపీని గెలిపిస్తే బీసీ అభ్యర్థే సీఎం
- కేంద్ర క్రీడల శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్

సిద్దిపేట కమాన్: రాష్ట్రంలో బీజేపీని గెలిపిస్తే బీసీని ముఖ్యమంత్రి చేయడానికి అధిష్ఠానం సిద్ధంగా ఉందని కేంద్ర క్రీడల శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు. సిద్దిపేట బీజేపీ అభ్యర్థి శ్రీకాంత్‌రెడ్డికి మద్దతుగా పట్టణంలో సోమవారం నిర్వహించిన రోడ్‌షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అవినీతి పాలన సాగుతుందన్నారు. యువత పోరాటంతో తెచ్చుకున్న ప్రత్యేక రాష్ట్రంలో కేసీఆర్ ఉద్యోగాల భర్తీని మరిచిపోయారని ఆరోపించారు. బీఆర్ఎస్ కార్యకర్తలకే దళితబంధు పథకాన్ని మంజూరు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో సీఎం విఫలమయ్యారని అన్నారు. నేటి రజాకారులైన బీఆర్ఎస్, కాంగ్రెస్ నుంచి విముక్తి కలగాలంటే ఈ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం రూ.9లక్షల కోట్లు ఇచ్చిందని గుర్తు చేశారు. పంటలకు కనీస మద్దతు ధర కల్పిస్తామన్నారు. ఆడపిల్ల పుడితే రూ.2లక్షలు, ప్రతీ మహిళకు రూ.2500 చేయూత పథకం ద్వారా అందజేస్తామన్నారు. రూ.400కే గ్యాస్ సిలిండర్లు అందజేస్తామని, చమురు ధరలు తగ్గిస్తామని, డిగ్రీ చదివే విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తామన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవిత ఉందని, ఈ కేసులో ఎవరున్నా చట్టప్రకారం వదిలి పెట్టేది లేదన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ సంపూర్ణ మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రోడ్డు షో రూరల్ పోలీస్ స్టేషన్ చౌరస్తా నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో నాయకులు ఉపేందర్, శ్రీనివాస్, వెంకట్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్

విపక్షాలవి మోసపూరిత హామీలు

బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట)/నంగునూరు: కాంగ్రెస్, బీజేపీలవి మోసపూరిత హామీలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ శర్మ అన్నారు. సోమవారం మండల పరిధిలోని గంగాపూర్‌లో ఎస్సీ కుల సంఘం బీఆర్ఎస్‌కు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ కేసీఆర్ చేతిలోనే సురక్షితంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, సర్పంచ్ లింగారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కామిని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. మంత్రి హరీశ్‌రావు భారీ మెజార్టీ సాధించేలా కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేయాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు లింగంగౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం నంగునూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. మగ్ధుంపూర్, రాంపూర్ గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో లింగంగౌడ్ పాల్గొని ఎన్నికల మెనిఫేస్టోను ప్రజలకు వివరించారు.

సిద్దిపేటలో జోరుగా ప్రచారం

సిద్దిపేటజోన్/సిద్దిపేటఅర్బన్: పట్టణంలో ఆయా వార్డులో సోమవారం బీఆర్ఎస్ నాయకులు జోరుగా ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, వైస్ చైర్మన్ కనకరాజుతో పాటు ఆయా వార్డు కౌన్సిలర్లు కవిత, సురేష్, మోహిజ్, శ్రీనివాస్ యాదవ్, సుందర్, విఠోభ, మల్లికార్జున్, వజీర్ రఘురాం, సాయి ఈశ్వర్, ఎల్లం, దీప్తి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. అలాగే సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లిలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నవోదయ మాదిగ సంఘం సభ్యులు మంత్రి హరీశ్‌రావుకే ఓటు వేస్తామని ఏకగ్రీవ తీర్మానం చేసి వైస్ ఎంపీపీ అల్లం ఎల్లం, సర్పంచ్ రవీందర్‌గౌడ్‌కు అందజేశారు.

ఓడిపోతామనే కేసీఆర్ కుట్రలు

- కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్: గజ్వేల్, కామారెడ్డిలో ఓడిపోతానని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందనే భయంతో కేసీఆర్ కుట్రలు చేస్తున్నారని గజ్వేల్ కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి ఆరోపించారు. సోమవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌ను ప్రజల్లో బద్నామ్ చేయడానికి పత్రికల్లో నిత్యం 'రక్త చరిత్ర' పేరిట ప్రకటనలు గుప్పిస్తున్నారని మండిపడ్డారు. ఇదే క్రమంలో మంగళవారం గజ్వేల్‌లో నిర్వహించనున్న బహిరంగ సభలోనూ కేసీఆర్, హరీశ్‌రావులు కోడి కత్తి దాడి చేయించుకుని... దానిని కాంగ్రెస్‌పై నెట్టేయాలని కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. దాడి తర్వాత తన ఇంటిపై బీఆర్ఎస్ కార్యకర్తలను ఉసిగొలిపే ప్రమాదం ఉందన్నారు. దుబ్బాకలో బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడిని కాంగ్రెస్‌పై నెట్టే ప్రయత్నం చేసి ప్రజలను నమ్మించడంలో విఫలమయ్యారని తెలిపారు.



మాట్లాడుతున్న తూంకుంట నర్సారెడ్డి

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

గజ్వేల్‌రూరల్: వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న మద్యం కాటన్లను ఎన్నికల పర్యవేక్షణ నిఘా అధికారులు పట్టుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలో ఎన్నికల నిఘా అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళికి చెందిన వాహనంలో నాలుగు కాటన్ల బీర్లు, మూడు కాటన్ల బ్లెండర్స్ ప్రైడ్ మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయని తెలిపారు. అదేవిధంగా ఆదివారం రాత్రి మున్సిపల్ మాజీ కౌన్సిలర్ రొట్టెల రాందాస్‌కు చెందిన వాహనంలో సైతం పదమూడు కాటన్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని ఎక్సైజ్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ



కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని ఆలయ అధికారులు, అర్చకులు సహస్ర దీపాలంకరణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ముఖ మండపంలో శివలింగం, స్వస్తిక్, ఓం ఆకారాలలో దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ బాలాజీ, ఏఈఓ వైరాగ్యం అంజయ్య, ఆలయ ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్ పాల్గొన్నారు.